క్లుప్తంగా

ముందస్తు చెల్లింపు చేస్తే ఐదు శాతం రాయితీ

చొప్పదండి: చొప్పదండి మున్సిపాలిటీలో ఆస్తి పన్ను, నల్లా బిల్లులు ముందస్తుగా చెల్లించిన వారికి పన్నులో ఐదు శాతం రాయితీని కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను, నల్లా బిల్లు ముందుగా చెల్లించిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

ఇల్లందకుంట: ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.ఐదు లక్షల నిధులతో మండలంలోని రాచపల్లి గ్రామంలో గురువారం సీసీ రోడ్ పనులను ఎంపీడీవో పుల్లయ్య ప్రారంభించారు. మూడెత్తుల మల్లేశం, అరెల్లి మోహన్, ఎండి.లాల్‌మహ్మద్, మోత్కూర్ గణేశ్, బెల్ల ఐలయ్యయాదవ్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



సిద్ధికను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్

చొప్పదండి: చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థి అర్థ సిద్ధిక ఇటీవల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి గణిత ఒలింపియాడ్, హమ్మింగ్ బర్డ్ గణిత విభాగంలో ప్రతిభ కనబర్చి కనబర్చి ప్రథమ బహుమతి గెలుపొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

చొప్పదండి: రాష్ట్రంలో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. రైతులకు అవసరమైన సౌకర్యాలను అందించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టాలు వస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు.

రిజిస్టర్లలో అప్‌డేట్ చేసుకోవాలి

గంగాధర: సీడ్, ఎరువులు, పురుగు మందులను వివరాలను డీలర్లు ఎప్పటికప్పుడు రిజిష్టర్‌లో అప్‌డేట్ చేసుకోవాలని ఏడీఏ ప్రియదర్శిని అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్‌లను ప్రతిఒక్కరూ సరిచూసుకోవాలని అన్నారు. మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామానికి చెందిన శనిగరపు రాజయ్య కొంత కాలంగా అనారోగ్యంతో నడవలేని స్థితిలో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్‌ను సంప్రదించగా, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఐఏఎస్ పరికిపండ్ల నరహరి దృష్టికి తీసుకెళ్లి చేయూత అందించారు. బాధితుడికి గురువారం వీల్‌చైర్ అందజేశారు.

అదృశ్యం కేసు నమోదు



రవికుమార్

జమ్మికుంట: పట్టణంలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి రవికుమార్ అదృశ్యమైనట్లు టౌన్ సీఐ రవి గురువారం తెలిపారు. రవికుమార్ టిప్పర్ కొనుగోలు చేసి వ్యాపారం చేస్తుండగా నష్టం వచ్చి ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురయ్యాడని, హైదరాబాద్ వెళ్లి వస్తానని ఇంటో చెప్పాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని, బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ తెలియడం లేదని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

బీటెక్ విద్యార్థి..



తరుణ్

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి తనుగుల తరుణ్ హనుమకొండ వాగ్దేవి కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. మూడురోజుల క్రితం ఇంటికి వచ్చి బుధవారం కాలేజీకి వెళ్లాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని, కాలేజీలో, స్నేహితులను అడుగగా రాలేదని తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

- నవాబుపేటలో ఇంజినీర్ల పర్యటన



నవాబుపేటలో అద్దె బావిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు

చిగురుమామిడి: చిగురుమామిడి మండలం నవాబుపేటలోని తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు, డీఈఈ శ్రీనివాస్, ఏఈ సువిశాల తెలిపారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యపై ఈనెల 7న కథనం ప్రచురితంకాగా, స్పందించిన అధికారులు గురువారం ఇంజినీరింగ్ అధికారులు గ్రామంలో పర్యటించి సమస్య తెలుసుకున్నారు. వాగులో నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి బావిని పరిశీలించారు. తక్షణమే టెండర్ పిలిచి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్, షాబొద్దీన్, కార్యదర్శి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



రామడుగు: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చిగురుమామిడి: చెక్కులు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

రామడుగు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 21 మంది కల్యాణలక్ష్మీ లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెక్కులు పంపిణీ చేశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల, వైస్ చైర్మన్ సత్యంరెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, ఎంపీడీవో రాజేశ్వరీ, కాంగ్రెస్ పార్టీ మండల ఆధ్యక్షుడు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: పేద, బడుగు, బలహీన వర్గాల యువతులకు సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించడం సంతోషించదగిన విషయమని మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం చిగురుమామిడిలోని రైతు వేదికలో 11 గ్రామాలకు చెందిన 64 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.64.07లక్షల చెక్కులను అధికారులతో కలిసి పంపిణీ చేశారు. తహసీల్దార్ బి.రమేశ్, ఎంపీడీవో మధుసూదన్, మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పర్శరాములు, కుతుబుద్దీన్, చిటుమల్ల రవీందర్, ఆర్‌ఐ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



భద్రాద్రి బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ కృష్ణమూర్తి, తదితరులు

జమ్మికుంట: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చేరుకూరి కృష్ణమూర్తి అన్నారు. గురువారం పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్‌లో భద్రాద్రి బ్యాంక్ 23వ శాఖను డా.రాము, జిల్లా సహకార అధికారి రామానుజచార్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భద్రాద్రి బ్యాంక్ అంచలంచెలుగా ఎదుగుతూ 70వేల మంది ఖాతాదారులతో సుమారు వెయ్యి కోట్ల టర్నోవర్ కలిగి ఉందన్నారు. బ్యాంక్ సీఈవో దాసరి వేణుగోపాల్, డీజీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీవో సుగుణ

హుజూరాబాద్: పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో సుగుణ మాట్లాడుతూ, గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. సూపర్‌వైజర్ రాజశ్రీ, పంచాయతీ కార్యదర్శి శ్రావణకుమార్, అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ నాగరాజు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, రమేశ్, అంగన్వాడీ టీచర్ సుజాత తదితరులు ఉన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

శంకరపట్నం: కేశవపట్నం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో 24గంటలు క్యాష్ డిపాజిట్, విత్ డ్రా మిషన్ ఏర్పాటు చేసినట్లు రీజనల్ మేనేజర్ వెంకటేశ్ తెలిపారు. మండలంలోని కేశవపట్నం ఎస్‌బీఐ నూతన బ్రాంచ్‌లో గురువారం బ్యాంక్ ఖాతాలను ప్రారంభించి పాసు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేశవపట్నంలో నూతన బ్రాంచ్‌ను రూ.కోటితో అన్ని వసతులతో ఏర్పాటు చేశామన్నారు. పంట రుణాలు, విదేశీ విద్య రుణాలు, వ్యాపారులకు రుణాలు అందించనున్నట్లు చెప్పారు. రైతులు, వ్యాపారులు, పేదలు, విద్యార్థులు, నిరుద్యోగులు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎస్సై రవి, మేనేజర్ ప్రదీప్, చీఫ్ మేనేజర్ ప్రసాద్, మార్కెట్ డైరెక్టర్లు తనుకు ప్రభాకర్, గాజుల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, మాజీ ప్రజాప్రతినిధులు సమ్మయ్య, రామస్వామి, రాజ కొంరయ్య, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు.. ఆటో ఢీ

- ఆటోలోంచి బయటపడిన జిలెటిన్ స్టిక్స్



గంగాధర: రోడ్డు ప్రమాదానికి గురైన ఆటో

గంగాధర: గంగాధర మండలం మధురానగర్ శివారులో జగిత్యాల- కరీంనగర్ జాతీయ రహదారిపై గురువారం ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో బోల్తా పడింది. ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలంలో ఆటోను పరిశీలించిన పోలీసులకు రెండు బాక్సుల్లో రూ.8వేల విలువజేసే, నాలుగు వందల జిలెటిన్ స్టిక్స్, డీ-కార్డు వైర్ బెండల్ లభ్యమైంది. ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా బాక్సింగ్ జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో గురువారం జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో అండర్-19 పురుషుల, మహిళల బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. 20మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో రాణించిన ఆదిల్ సమీర్, స్వరూప్, సంజీవ్, విజయ్ కుమార్, మణిదీప్‌లు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి కరీంనగర్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కొత్తకొండ సంపత్ కుమార్ తెలిపారు. పోటీల నిర్వాహణలో కరీంనగర్ జిల్లా బాధ్యులు జి మురళి, కోచ్‌లు వికాస్, శ్రీకాంత్ రాజేందర్, పీడీ కుమార్, సీనియర్ బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు

కరీంనగర్: శాతవాహన యూనివర్సిటీ చౌరస్తా మల్కాపూర్‌రోడ్‌లోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.అనిల్‌ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు బీసీ సంఘం నాయకులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పబ్లిక్ టాయిలెట్స్ కోసం స్థల పరిశీలన



రవాణా కార్యాలయం ఎదుట స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

తిమ్మాపూర్: తిమ్మాపూర్ రవాణా శాఖ కార్యాలయంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం గురువారం స్థలాన్ని పరిశీలించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం, ఎంవీఐ రవికుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్, యూనిసెస్ కోఆర్డినేటర్లు కిషన్ స్వామి, రమేశ్ రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న రవాణాశాఖ కార్యాలయంలో స్థలాన్ని చూశారు.

క్షేత్రస్థాయి పరిశీలన

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామంలో ఎస్ఆర్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు, కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త డా.మహేశ్ ఆధ్వర్యంలో పీఆర్ఏ (పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్) గ్రామీణ విశ్లేషణాత్మక తులనం కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అంశాలను ప్రదర్శించి రైతులకు వివరించారు. స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డా.భూపాలరాజ్, కోఆర్డినేటర్ శ్రీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూత



దాతలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్వాహకులు, విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం హుజూరాబాద్ పట్టణానికి చెందిన డా. ముక్క నవీన్, డా. స్వాతి కూమారుడు కే.శే. ముక్క నివేశ్ జ్ఞాపకార్థం రూ.2.50లతో నిర్మించిన ఐరన్ రేకుల షెడ్ వరండాను గురువారం తాతయ్య డా.కృష్ణమూర్తి, నానమ్మ అరుణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలకు వ్యవస్థాపకుడు బచ్చిరాములు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్



చిగురుమామిడి: సుందరగిరి ప్రాథమిక పాఠశాలకు ప్యూరిఫైర్ అందించిన విద్యార్థులు

చిగురుమామిడి: చిగురుమామిడి మండలం సుందరగిరి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల కోసం గురువారం 2003–04 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు రూ. 20 వేల విలువచేసే ప్యూరిఫైర్ బహూకరించారు. తోటి విద్యార్థి పత్తెం సంతోష్ ఇటీవలే మరణించగా, ఆయన జ్ఞాపకార్థం అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంతోష్ తల్లి భారతవ్వ, పూర్వ విద్యార్థులు సుంకరి శ్రీనివాస్, శ్రీమూర్తి శ్రీనివాస్, పత్తెం రమేశ్, మెడబోయిన రాజు, గైని శ్రీనివాస్, చిలుమోజు శ్రీకాంత్, బత్తిని రవీందర్, శ్రీమూర్తి చిన్న శ్రీనివాస్, జీల రమేశ్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం



శోభ(ఫైల్)

శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులోని ఫ్లైఓవర్ వద్ద సోమవారం కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన కొడగోని శోభ (50) గురువారం మృతిచెందినట్లు ఎస్సై రవి తెలిపారు. సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన కొడగోని కిషన్‌రావు, భార్య శోభ, కూతురు వరికెల అశ్వినితో కలిసి మోటర్ సైకిల్‌పై మానకొండూర్ మండలం నిజాయితీగూడెంలోని బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడ్డ శోభను స్థానికులు 108లో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయినట్లు ఎస్సై వివరించారు.

ఆలయంలో చోరీ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

మానకొండూర్: మానకొండూరు మండలం అన్నారం శివారులోని వరాహగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి హుండీలోని రూ. 15 వేల నగదు, 10 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆలయ చైర్మన్ కత్తెర్ల అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ దేశానికి శ్రీరామరక్ష



మానకొండూర్: మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: దేశానికి కాంగ్రెస్ పార్టీ శ్రీరామరక్ష అని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ముగింపు పాదయాత్ర ముంజంపల్లి, సదాశివపల్లిలో నిర్వహించారు. ముంజంపల్లిలో మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: ఇప్పలపల్లి, అంబాల్‌పూర్, కరీంపేట గ్రామాల్లో గురువారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్రలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, పద్మ, తిరుపతి, గట్టు తిరుపతి, షారుఖ్, రాజిరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంకాయగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో కృష్ణప్రసాద్ తదితరులున్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ కార్తిక

మానకొండూర్: దేవంపల్లి గ్రామంలో పీవీ నరసింహారావు వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజ్, కరీంనగర్ వారి జాతీయ సేవాపథకం కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కార్తీక మాట్లాడారు. వెటర్నరీ విద్యార్థులు పశు వైద్య చికిత్సలు నేర్చుకోవాలని కోరారు. 45 పశువులకు చికిత్సలు చేశారు. పాలిటెక్నిక్ కాలేజ్, కరీంనగర్ డాక్టర్ వినీత, మానకొండూర్ పశు వైద్యాధికారి డాక్టర్ సుష్మిత, డాక్టర్ అరవింద్‌రెడ్డి, సిబ్బంది కనకయ్య, సంధ్యారాణి, వెంకటయ్య, అరుణ్ సాగర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మహాసభకు తరలిరావాలి



మాట్లాడుతున్న అంజయ్య

చిగురుమామిడి: ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి కార్యకర్తల, సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఐదు వేలకు పైగా తరలిరావాలన్నారు. చిగురుమామిడి సింగిల్‌విండో అధ్యక్షుడు జంగ వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ భేతి రాజిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్‌రెడ్డి, నాయకులు రామోజు కృష్ణమాచారి, సాంబారి కొంరయ్య, మాజీ సర్పంచులు సన్నీల్ల వెంకటేశం, బోయిని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, పెద్దపల్లి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రాము

ఇల్లందకుంట: ఇటీవల ఈదురుగాలులకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాము డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీరాములపల్లిలో నేలవాలిన మొక్కజొన్న పంటను గురువారం పరిశీలించారు. పీచుదశకు వచ్చిన మొక్కజొన్న దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం మండల కమిటీ సభ్యులు గ్యారంపల్లి సంతోష్, రైతులు శ్రీకాంత్, శంకర్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.